క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

మిర్యాలగూడ: పట్టణంలోని బంగారుగడ్డ జెడ్పీ హెచ్ఎస్‌లో ప్రారంభించిన తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ కేంద్రాన్ని చదువుపై ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఇంజమూరి కాటయ్య, సహాయ కార్యదర్శి రమావత్ రాంసింగ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీస అర్హత ఉన్నవారు పదో తరగతి, పదో తరగతి పాసైన వారు ఒకే ఏడాదిలో ఇంటర్‌ను పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. పదో తరగతిలో అడ్మిషన్ కోసం రికార్డు షీట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, అదు విధంగా ఇంటర్‌లో అడ్మిషన్ కోసం టెన్త్ మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలను పాఠశాలలో అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966664684 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దేవరకొండ సీఐగా బాధ్యతల స్వీకరణ


నాగభూషణం, సీఐ

దేవరకొండ: దేవరకొండ సీఐగా ఎం. నాగభూషణం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన శంకర్‌గౌడ్ రాచకొండ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న నాగభూషణం పదోన్నతి పొంది సీఐగా వచ్చారు. ఈ నందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నిడమనూరు ఎస్ఐగా గోపాల్‌రావు

నిడమనూరు: నిడమనూరు ఎస్ఐ ఎం. శోభన్ బాబును హాలియా స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ అపూర్వరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో సీసీఎస్‌లో ఉన్న గోపాల్‌రావును ఇక్కడ ఎస్ఐగా నియమించారు.

పెద్దవూర ఎస్ఐగా రమేష్

పెద్దవూర: పెద్దవూర ఎస్ఐగా అజ్మీరా రమేష్‌ను నియమిస్తూ ఎస్పీ అపూర్వరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పచ్చిపాల పరమేష్ వారం క్రితం సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా.. జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో వీఆర్‌లో ఉన్న అజ్మీరా రమేష్ బదిలీపై పెద్దవూరకు వచ్చారు.

సుందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి


సుందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి తదితరులు

నాగార్జునసాగర్: ఎన్ఎస్పీ నాగార్జునసాగర్ డివిజనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా రిటైరైన కోట్ల సుందర్‌రెడ్డి గుండెపోటుకు గురై హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. సుందర్‌రెడ్డి భౌతికకాయానికి సోమవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల ఆయన నివాసంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, చెన్ను సుందర్‌రెడ్డి, కౌన్సిలర్లు రమేష్‌జీ, రామకృష్ణ, మంగ్తానాయక్, నెల్లికల్లు సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, మోహన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నివాళులర్పించిన జానారెడ్డి

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కోట్ల సుందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పెద్దవూర మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, రంగారెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు.

పేదల శ్రేయస్సే నాట్కో ట్రస్ట్ లక్ష్యం



నెల్లికల్లులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పేదల శ్రేయస్సే నాట్కో ట్రస్ట్ లక్ష్యమని, అందుకు అనుగుణంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాగార్జునసాగర్‌లోని నాట్కో ట్రస్ట్ సీనియర్ జనరల్ మేనేజర్ వీరనారాయణరెడ్డి అన్నారు. తిరుమలగిరి మండలంలోని నెల్లికల్లు జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 155 మంది మహిళలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాట్కో ట్రస్ట్ ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు, గ్రామ సర్పంచ్ పమ్మి జనార్దన్‌రెడ్డి, డాక్టర్లు రంజిత్, నాగేందర్, సర్వేశ్వర్‌ప్రసాద్, అంకిత, కిరణ్, ఎంఎన్‌జీ క్యాన్సర్ టెక్నీషియన్లు, ట్రస్ట్ ప్రతినిధులు జీఎల్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ డ్యాం దిగువన మట్టి తరలింపు

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అటవీశాఖ అధికారులు


ట్రాక్టర్‌లోకి మట్టి ఎత్తిపోస్తున్న జేసీబీ

నాగార్జునసాగర్ : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నాగార్జునసార్ డివిజన్ పరిధిలో పైలాన్ కాలనీ వైకుంఠధామం దిగువ ప్రాంతం నుంచి కొందరు ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. పట్టపగలే మట్టి తోలకం సాగుతున్నా అటవీ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సాగర్ ఎర్త్ డ్యాం దిగువనే ఈ విధంగా మట్టి తవ్వకాలు చేపడితే.. భవిష్యత్‌లో ఎర్త్‌డ్యాంకు మట్టి లభ్యమయ్యే పరిస్థితి ఉండదు. ఇప్పటికే రోడ్డువెంట కూడా 5 నుంచి 10మీటర్ల లోతు గుంతలు పెట్టి మట్టిని ఎత్తారు. ఈ ప్రాంతంలో వాహనాలు రోడ్డు దిగితే పల్టీకొట్టే విధంగా గుంతలు ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ మట్టి తవ్వకాల వల్ల భవిష్యత్‌లో జరిగే ప్రమాదం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. మట్టిని తరలించే వారు మాత్రం ఫారెస్ట్ అధికారుల అనుమతితోనే తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. ఎర్తుడ్యాం దిగువననే మట్టి తరలిస్తుండడంతో అటవీ అధికారులు అనుమతించేందుకు వీలు లేదు. అయితే అధికారుల కనుసన్నల్లోనే ఈ మట్టి దందా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

అటవీ భూములను కాపాడుతాం

అటవీ ప్రాంతం నుంచి మట్టిని తరలించే ట్రాక్టర్లను, జేసీబీలను అక్కడి నుంచి పంపించాం. మట్టిని తరలించే ప్రాంతం అటవీ శాఖదో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోకి వస్తదో తేల్చి సరిహద్దులు చూపించాలని మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ సర్వేయర్‌ను కోరాం. ఎట్టి పరిస్థితుల్లోనూ అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటాం. – సర్వేశ్వర్, ఎఫ్‌డీఓ

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

మిర్యాలగూడ: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిరోజు మురుగుకాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, మురుగు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయాలని, వారంలో ఒక రోజు డ్రైడేను పాటించాలన్నారు. అనుకున్న లక్ష్యం మేరకు హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటాలన్నారు. హార్టికల్చర్ మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నందున బయటి సిబ్బందిని నియమించుకొని గ్రామాల్లో పనులు చేయించాలన్నారు. పెన్షన్ పొందేవారు మృతిచెందినట్లయితే వారి అకౌంట్‌ను డిలీట్ చేయాలని, పెన్షన్ల కోసం అర్హులు ఉంటే వారి సరైన పత్రాలను కార్యాలయంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకుడు పి. కరుణాకర్ రావు, టీఏలు సౌజన్య, పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి


శశిపాల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు

పెద్దవూర: మండల పరిధిలోని పర్వేదుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ దేవసాని శశిపాల్‌రెడ్డి ఆదివారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి సోమవారం పర్వేదుల గ్రామానికి వెళ్లి శశిపాల్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. శశిపాల్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. వారి వెంట మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, సల్ల హన్మంతరెడ్డి, పగడాల నాగరాజు, సర్పంచ్ దండ మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే 'చలో అసెంబ్లీ'


దేవరకొండ: మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి

దేవరకొండ: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే చలో అసెంబ్లీ నిర్వహిస్తామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు నిరహిస్తున్న సమ్మెలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గత 26రోజులుగా కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి జూలూరు వెంకట్రాములు, నరసింహ, అంజమ్మ, ఇద్దయ్య, జంగమ్మ, కృష్ణయ్య తదితరులున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంషొద్దీన్, శ్రీకాంత్, సైదులు, జనార్దన్, రాములమ్మ, లింగమ్మ, యాదయ్య, శాంతమ్మ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 26వ రోజుకు చేరుకుంది.

జిలకరకుంటతండాలో తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు

అడవిదేవులపల్లి: మండలంలోని జిలకరకుంటతండాలో సోమవారం తీజ్ వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెళ్లికాని యువతులు మొలకల బుట్టలకు పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కూరాకుల మంగమ్మ, స్థానిక సర్పంచ్ కుర్ర పకీరానాయక్, గిరిజన నాయకుడు కుర్ర అశోక్‌నాయక్, లక్ష్మణుడు, రవీందర్, హరిచంద్ర, చందు, హతిరాం, హనుమ, నాగులు, సైదా, నాగులు తదితరులున్నారు.

న్యాయవాది హత్యను ఖండించిన 'ఐలూ'

మిర్యాలగూడ టౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది రాయసం వితల్‌బాబును అతి దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ సోమవారం మిర్యాలగూడలో ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ)ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐలూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం మాట్లాడుతూ.. వితల్‌బాబు విజయవాడ కోర్టులో ప్రాక్టీస్ చేస్తూ బాపట్ల జిల్లా అద్దంకి కోర్టులో ఓ కేసు విషయంలో వాయిదా చూసుకొని ఇంటికి వెళ్తుండగా హత్యకు గురికావడం చాలా బాధకరమన్నారు. న్యాయవాదిని హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో ఐలూ అధ్యక్షుడు పరమేష్, కార్యదర్శి కె. వెంకట్‌రెడ్డి, కళ్యాణ్, కరుణాకర్, రాజేష్, రాంచంద్రయ్య, కుమార్‌రెడ్డి, రామకృష్ణ, నాగరాజు తదితరులున్నారు.

మణిపూర్ హింసాకాండకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీలు

మిర్యాలగూడ టౌన్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హింసాకాండను వ్యతిరేకంగా సోమవారం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ క్రైస్తవ ఐక్య వేదిక కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ.. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాలని కోరారు. ర్యాలీలో మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ క్రైస్తవ ఐక్య వేదిక కమిటీ పాస్టర్లు విల్సన్, బండారు అనిల్‌కుమార్, ఇమ్మానియేలు, సౌందర్య రాజు, ధీరావత్ హన్యానాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుక విద్యాసాగర్, ముండ్లగిరి కాంతయ్య, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: పట్టణంలో సోమవారం క్రైస్తవ, మైనార్టీల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెండు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింసను అణిచివేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సెంటినరీ ఎంబీ చర్చి పాస్టర్ వేణు, ముఫ్తీ జావిద్‌హుస్సేన్, ఫారుఖ్ మౌలానా, సుందర్‌రాజు, క్రిస్టఫర్, ప్రసన్న కుమార్, డానియల్, సంపత్‌రాజు, టైటస్, ఐజాక్, శ్యాంసన్, బారి, ఇలియాస్ పటేల్, బత్తుల అమర్, తౌఫిక్, పాస్టర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మణిపూర్‌లో గిరిజన తెగకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటనతో పాటు క్రిస్టియన్లు, చర్చిలపై దాడులకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం యునైటెడ్ క్రిస్టియన్ సర్వీస్ సొసైటీ, కొండమల్లేపల్లి మండల పాస్టర్ల ఆధ్వర్యంలో దేవరకొండ రోడ్డులోని శిలువ మినిస్ట్రీస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు జకర్యా, అమృతం, ఏకుల సామేల్, వంశీ, శాలెం, రాజు, సునీల్, క్రిస్టోఫర్, వేణు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ: శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు


దేవరకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ, మైనార్టీ నాయకులు

రైతుల బాధ తెలిసిన నాయకుడు కేసీఆర్


దేవరకొండ: కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి: రైతుల బాధ తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. సోమవారం చింతపల్లి మండల పరిధిలోని జర్పులతండాలో రూ.45లక్షలతో, హోమంతాపల్లిలో రూ.25లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో రైతు బంధు, రైతు బీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.10వేలు పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇస్తుందని పేర్కొన్నారు. నిరంతరం 24గంటల విద్యుత్‌ను అందించడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం గిరిజన రిజర్వేషన్లు 6 నుంచి 10 శాతానికి పెంచడం ద్వారా గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. 500లకు పైగా జనాభా ఉన్న గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిందన్నారు. రాష్ట్రంలోని తండాల్లో బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.2వేల కోట్లను మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, నట్వ గిరిధర్, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోపిడి కిష్టారెడ్డి, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, ఉజ్జిని నరేందర్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

దేవరకొండ: చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన 20కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల సర్వయ్య, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, దొండేటి మల్లారెడ్డి, బోయపల్లి రాములు, అప్పల రామలింగం, గుండె వెంకటయ్య, ఎరుకలి సత్యనారాయణ, కొండల్, ప్రశాంత్, లింగం, వెంకటయ్య తదితరులున్నారు.

'సీఎం సహాయ నిధి' పేదలకు వరం


మిర్యాలగూడ: లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 41 మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.17.64లక్షల విలువైన చెక్కులను సోమవారం జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బైరం బుచ్చయ్య, వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పాపారావు, నాయకులు రాములుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, ధనావత్ బాలాజీనాయక్, మల్లీశ్వరిగోపి, ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

మిర్యాలగూడ పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని వై జంక్షన్, తడకమళ్ల రోడ్డు, నందిపాడు బైపాస్, ఈదులగూడ బైపాస్, సాగర్ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులతో పాటు ఆయా ప్రధాన కూడళ్లలో స్వాగత తోరణాల నిర్మాణం, ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద బ్యూటిఫికేషన్ పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, మున్సిపల్ అధికారులు ఆసీం, మాజీ కోఆప్షన్ సభ్యుడు లతీఫ్, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే క్రైస్తవులకు సముచిత స్థానం

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత క్రైస్తవులకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండను ఖండిస్తూ క్రైస్తవ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిర్వహించిన శాంతి ర్యాలీలో భాగంగా ఎమ్మెల్యే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఒక్క మతాన్నే సమర్థిస్తూ కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సబ్బండాల వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

తల్లిపాలే చిన్నపిల్లలకు శ్రేయస్కరం


హాలియా: తల్లిపాల వారోత్సవాల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రమాదేవి


మిర్యాలగూడ టౌన్: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ మమత


కొండమల్లేపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

హాలియా: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని కౌన్సిలర్ పిల్లి చంద్రకళాఅంజనేయులు, సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అనుముల ఆధ్వర్యంలో సోమవారం హాలియా మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టిన శిశువుకు వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. అనంతరం పోలీసులు షీటీం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రునాయక్, పోలీసులు గోవిందరాజు, బసవయ్య, వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు విజయ, సుజాత, మహిళ తదితరులు ఉన్నారు.

అవగాహన కల్పించాలి..

మాడుగులపల్లి: తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. సోమవారం మండలంలోని కుక్కడం, చింతలగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీలు, ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మంగళవారం నుంచి ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిపాలతో బిడ్డకు ఒనగూరే ప్రయోజనాలను తెలియజెప్పాలని సూచించారు. ముర్రుపాలు అందించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిని, నాగమణి, రమణి, డీఆర్‌డీఏ సీసీలు సైదులు, నాగయ్య, ఏఎస్ఆర్ రావు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తల్లులకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. సరళ మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

శెట్టిపాలెంలో..

వేములపల్లి: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ.. తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు జ్యోతి, నిర్మల, జయమ్మ, శిల్ప, అంగన్‌వాడీ టీచర్లు రజిత, ఆశ వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సైదాబేగం అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో సోమవారం తల్లిపాల వారోత్సవాలపై టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, సమభావన సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): తల్లిపాల వారోత్సవాలలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు వీధుల్లో ర్యాలీగా తిరుగుతూ తల్లిపాల విశిష్టత గురించి తెలియజేశారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ సీడీపీఓ గంధం పద్మావతి మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం వలన 22శాతం నవజాత శిశు మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, యాదమ్మ, విజయలక్ష్మి, ఏఈఓలు హేమలత, జ్యోతి, సుస్మిత, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వారం పాటు నిర్వహించాలి..

మిర్యాలగూడ టౌన్: తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ మమత అన్నారు. మిర్యాలగూడలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ వారోత్సవాల్లో అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది భాగస్వాములయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి. రేవతి, బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

కొండమల్లేపల్లి: మండలంలోని గౌరికుంటతండాలో రూ.5లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను సోమవారం గ్రామ పెద్ద చందుసాత్‌తో కలిసి సర్పంచ్ రాజేశ్వరీదీప్‌లాల్ ప్రారంభించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మాడుగులపల్లి: మండలంలోని అర్హులైన రైతులంతా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లను దరఖాస్తుకు జత చేసి మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఆగస్టు 5 వరకు దరఖాస్తు గడువు ఉందని, అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

కొండమల్లేపల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఆగస్టులో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకూరి నాగరాజుమాదిగ పిలుపునిచ్చారు. సోమవారం కొండమల్లేపల్లిలోని క్రాంతి జూనియర్ కళాశాలలో మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థులతో నూతన కమిటీని ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మారేపల్లి యాదగిరిమాదిగ, శివప్రసాద్, రాజేష్, ప్రభుదాస్, రాజేశ్వరి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా భవానీ పండుగ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని సుంకిశాలతండాలో సోమవారం సీత్లా భవానీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గిరిజన మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి యాటపోతులను బలిచ్చారు. పెళ్లికాని యువతులు నీళ్ల బిందెలను ఎత్తుకొని అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేశావత్ జ్యోతీరామకృష్ణనాయక్, అన్నానాయక్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

గుర్రంపోడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. సోమవారం గుర్రంపోడు మండలంలోని తానేదార్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డైమండ్ లయన్స్ క్లబ్ సహకారంతో రూ.12వేల విలువైన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

365 రోజులకు చేరిన రిలే దీక్షలు

పెద్దఅడిశర్లపల్లి: గుడిపల్లిని మండలంగా ప్రకటించాలని కోరుతూ గుడిపల్లి మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 365 రోజులకు చేరాయి. కార్యక్రమంలో మండల సాధన కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, భూతం సైదులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చింతపల్లి: మండలంలోని రోటిగడ్డతండా గ్రామపంచాయతీలో రేషన్ దుకాణం, పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని సోమవారం తహసీల్దార్ విశాలాక్షికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో ఐదు కిలోమీటర్ల దూరంలోని తక్కెళ్లపల్లికి వెళ్లి రేషన్ తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణంతో పాటు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడా పోటీలు ప్రారంభం

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ స్టేడియంలో మిర్యాలగూడ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను సోమవారం వన్ టౌన్ సీఐ రాఘవేందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి ఎలియాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు నక్క శ్రీను, కృష్ణ, మిర్యాలగూడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిమల్లె వెంకన్న, పందిరి లక్ష్మణ్, బంటు నాని, సంతోష్ తదితరులు ఉన్నారు.